క్లుప్తంగా

ఆలయ భూములకు పెరిగిన కౌలు



వేలం పాటలో మాట్లాడుతున్న ఈఓ శ్రీకాంత్

నేలకొండపల్లి: స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి చెందిన భూములకు ఆలయ ఈఓ కె.శ్రీకాంత్ సమక్షంలో వేలం పాట నిర్వహించారు. మొత్తం 11 విభాగాల్లో 8 ప్రాంతాలకు చెందిన భూములకు వేలం పాటను ఖరారు చేశారు. గతేడాది రూ.7,91,500 వేలం పాటను ఖరారు కాగా ప్రస్తుతం రూ.8,79,100లకు ఖరారైంది. మిగిలిన మూడు చోట్ల భూములకు ఈ నెల 28న వేలం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ కనమర్లపూడి రమేష్, సభ్యులు మోర మల్లయ్య, కైలాసపు కోటేశ్వరీ, పి.సత్యం, సత్యనారాయణ, పూజారి తుపురాణి మధుసుధనాచార్యులు, నాచేపల్లి సొసైటీ చైర్మన్ తన్నీరు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావు, కూరాకుల నాగేశ్వరరావు, కై లాసపు వెంకటేశ్వర్లు, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణపై కేసు నమోదు

రఘునాథపాలెం: మండలంలోని రజబ్ అలీనగర్‌లో దంపతుల మధ్య మొదలైన ఘర్షణ ఇరు కుటుంబాల గొడవకు దారి తీసింది. రజబ్ అలీనగర్‌కు చెందిన సతీష్‌తో వీ.వీ.పాలెంకు చెందిన మహేశ్వరికి కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇరువురి మధ్య సఖ్యత లేకపోవడంతో గురువారం పంచాయితీకి ఇరువర్గాలు సమావేశమయ్యారు. ఈక్రమంలో ఘర్షణ జరగగా ఇరువర్గాల ఫిర్యాదులతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

కిరాణం షాప్‌లో చోరీ

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలోని ధనుంజయ కిరాణం షాప్‌లో చోరీ జరిగింది. రోజులాగే గురువారం రాత్రి షాప్‌నకు తాళం వేసి వెళ్లిన యజమాని శుక్రవారం ఉదయం వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉంది. దీంతో పరిశీలించగా రూ.12 వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

తహసీల్దార్లకు శుభాకాంక్షలు



అర్బన్ తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్/ఖమ్మంమామిళ్లగూడెం/తిరుమలాయపాలెం: ఖమ్మం అర్బన్ మండలం నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా దొడ్డారపు సైదులును బీజేపీ నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకుడు కుమిలి శ్రీనివాసరావు బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. బీజేపీ అర్బన్ అధ్యక్షుడు వాకదాని రామకృష్ణ, కంపసాటి అంజన్న, ఏపూరి నాగేశ్వరరావు, కందుల శ్రీకృష్ణ, హుస్సేన్, రాము, సీతారాములు తదితరులు పాల్గొన్నారు. అలాగే తిరుమలాయపాలెం మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన లూథర్ విల్సన్‌ను పలు పార్టీల నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇబ్రాయిల్, లక్ష్మణ్, వెంకటరెడ్డి, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు ఎ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	హిట్: ది థర్డ్ కేస్, ఏసీఈ
వినోద	సింగిల్
సాయిరాం	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్
ఆదిత్య	యమదొంగ, 23
శ్రీనివాస	మిషన్ ఇంపాజిబుల్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	26	పాలకూర	4
పచ్చిమిర్చి	26		20
కాకర	66	చుక్కకూర	3
బీర	50		20
దొండ	20	తోటకూర	4
పొట్లకాయ	36		20
చిక్కుడు	106	గోంగూర	4
గోరుచిక్కుడు	46		20
క్యాబేజీ	20	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	42	పుదీన	1
క్యాప్సికం	66		20
బీట్‌రూట్	26	-ఖమ్మం వ్యవసాయం	

ఆధిపత్య పోరు..



తాళ్లతో హద్దులు ఏర్పాటు చేసుకున్న ఆక్రమణదారులు

ప్రభుత్వ మిగులు భూమి ఆక్రమణకు యత్నం..

- మంచికంటినగర్‌లో మాటల యుద్ధం
- హద్దుల ఏర్పాట్లలో ఘర్షణ
- అధికారుల జోక్యం శూన్యం

ఖమ్మం అర్బన్: నగరంలోని 4వ డివిజన్ మంచికంటినగర్‌లో ప్రభుత్వ మిగులు భూమిని ఆక్రమించుకునే ప్రయత్నంలో పేదల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. సాగర్ ప్రధాన కాలువకు ఆనుకుని ఉన్న ఈ భూమిని అక్రమంగా ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. తాజాగా మంచికంటినగర్ నుంచి పెద్దమ్మ గుడి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టిన నేపథ్యాన రోడ్డుకు.. సాగర్ కాలువ మధ్యలో ఉన్న మిగులు భూమి సుమారు 15 ప్లాట్ల స్థలం ఉంది. అయితే కొందరు దీన్ని ఆక్రమించుకునేందుకు ప్లాట్లుగా బాగాలు చేస్తూ హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో కొందరు ఒకటి కంటే ఎక్కువ స్థలాలు ఆక్రమించేందుకు పూనుకోవడంతో ఇతరుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమై ఘర్షణ వాతావరణం ఏర్పడింది.

ఆధిపత్యం ప్రదర్శిస్తూ..

ఒక్కరికి ఒక్క స్థలం చాలు అని కొందరు అభ్యర్థించగా.. మరి కొందరు తమ ఆధిపత్యం ప్రదర్శిస్తూ మరింత స్థలం ఆక్రమించాలన్న ఆలోచనతో ముందుకురావడంతో మాటల యుద్ధం చోటు చేసుకుని ఘర్షణకు దారితీసింది. తొలుత గురువారం ఘర్షణ పడగా.. ఖమ్మం అర్బన్ పోలీసులు వచ్చి హెచ్చరిక చేసినట్లు తెలిసింది. మళ్లీ శుక్రవారం ఘర్షణ పడటంతో పాటు స్థానికంగా ఉండి ఇప్పటికే అక్రమించిన వారు కొంతమందిపై దాడికి ప్రయత్నంలో ఘర్షణ పడినట్లు తెలిసింది. ఇప్పటికే అదేప్రాంతంలో శ్మశాన స్థలంగా ఉన్న భూమిని ఆక్రమించి నివాసులు ఏర్పాటు చేసుకున్నారని కొంతమంది ఆరోపిస్తున్నారు.

ఇలాగే వదిలేస్తే..

ఇప్పటికైనా రెవెన్యూ, జల వనరులశాఖ అధికారులు సత్వరంగా స్పందించి ప్రభుత్వానికి చెందిన మిగులు భూములపై స్పష్టమైన హద్దులు నిర్ధారించి, అర్హులైన పేదలకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇలానే వదిలేస్తే సమస్యలు మరింత తీవ్రమై ఈ ప్రాంతంలో ఉద్రిక్తిత పరిస్థితులు చోటు చేసుకునే అవకాశం లేకపోలేదు. ఇందుకు తక్షణమే పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఖమ్మం అర్బన్ తహసీల్దార్ డి.సైదులును వివరణ కోరగా.. తమ దృష్టికి రాలేదని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి: రాష్ట్రంలో రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. శుక్రవారం ముచ్చర్ల క్రాస్ రోడ్డులో స్త్రీ టీస్టాల్ ప్రారంభించిన అనంతరం కొండాయిగూడెం సొసైటీ కార్యాలయంలో రైతులకు ప్రభుత్వం అందించిన సబ్సిడీ పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో వ్యవసాయరంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. అనంతరం పొన్నేకల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కొండాయిగూడెం, కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్లు ధనియాకుల హన్మంతరావు, పుచ్చకాయల వీరభద్రం, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, మద్దినేని రమేశ్‌బాబు, కొమ్మినేని శ్రీనివాసరావు, నల్లపునేని వినోదరావు, తోటకూరి భద్రయ్య, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, ఏఓ తారాదేవి, ఏఈఓ వేదిత, నల్లమోతు లక్ష్మయ్య, దొడ్డ వేణు, మాలోత్ సరిరాంనాయక్, ప్రేమ్‌కుమార్, చల్లా హరి, ఉప్పుగండ్ల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, మధ్య భారతదేశంలో ఆదివాసీలపై జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధాన్ని ఆపాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. ఆదివాసీల అంతం కోసం దండకారుణ్యంలో నెలకొన్న ప్రకృతి సంపదను కాజేసేందుకే మావోయిస్టుల మాటున కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను తరిమివేస్తున్నారని ఆయన ఆరోపించారు. శుక్రవారం సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యాన కర్రిగుట్ట అమరవీరులకు నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో ఆపరేషన్ కగార్ పేరుతో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్ర బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, కార్పొరేటర్ బీజీ క్లైమెంట్, పోటు కళావతి, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, సీహెచ్ సీతామహాలక్ష్మి, మిడికంటి వెంకటరెడ్డి, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ, జ్వాలా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిప్రసాద్ వర్ధంతి సభను జయప్రదం చేయండి



గిరిప్రసాద్ కాంస్య విగ్రహం వద్ద సీపీఐ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుడు, సాయుధ తెలంగాణ పోరాట యోధుడు నల్లమల గిరిప్రసాద్ వర్ధంతి సభ నేడు(శనివారం) సాయంత్రం ఖమ్మం రిక్కాబజార్ హైస్కూల్లో జరుగుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీపీఐ కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా పాత బస్టాండ్ వద్ద గల గిరిప్రసాద్ కాంస్య విగ్రహ సుందరీకరణ పనులను దండి సురేష్‌తో పాటు జిల్లా కార్యవర్గ సభ్యుడు శింగు నర్సింహారావు, కార్పొరేటర్ బీజీ క్లైమెంట్ తదితరులు పరిశీలించారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదాల మలుపు..



ప్రమాదాలకు నిలయమైన మూలమలుపు

పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండల పోచారం నుంచి కిష్టాపురం వెళ్లే రహదారి వ్యవసాయ పొలాల వద్ద మూల మలుపు ప్రమాదకరంగా తయారైంది. గత ఎనిమిదేళ్ల క్రితం బీటీ రోడ్డు విస్తరణలో భాగంగా వెడల్పు చేయగా.. కొద్ది కాలానికే మరమ్మతులకు గురైంది. దీంతో రోడ్డుపై బీటీ లేచి బైక్‌లు స్కిడ్ కావడం, ఆటోలు ఓ పక్కకు ఒరిగి కిందపడి గాయాలైన సంఘటనలు ఉన్నాయి. మరమ్మతులకు గురై ఏడాదవుతున్నా.. ఇంతవరకు పట్టించుకున్న నాథుడే లేరు. తక్షణమే మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ఖమ్మంరూరల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

తిరుమలాయపాలెం: మండలంలోని రాకాసితండా, పాతర్లపాడు, మహ్మదాపురం, తెట్టెలపాడు గ్రామాల్లో నేడు(శనివారం) మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించనున్నట్లు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంతాపం..

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం వన్‌టౌన్ 25 డివిజన్ కుమ్మరి బజార్ ప్రాంతానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు చిలకమర్రి పుల్లారావు గురువారం మృతి చెందగా.. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.విక్రమ్, ఎర్ర శ్రీనివాస్, ఎంఏ జబ్బార్, వంజాగు లక్ష్మీనారాయణ, ఖయ్యూం, ఎస్‌కె. నాగుల్‌మీరా, ఎస్‌కె. బేగం, కూరపాటి శ్రీనివాస్, నాగిశెట్టి యాదగిరి, అజిత, ఫరీదా, దాసరి నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

నేలకొండపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కొత్తకొత్తూరులో నూతనంగా నిర్మించనున్న పార్టీ గద్దె నిర్మాణ పనులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా అర్హులకే రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, రైతులకు విత్తనాలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కోటి సైదారెడ్డి, పార్టీ మండల కార్యదర్శి వెన్నబోయిన శ్రీనివాసరావు, నాయకులు అజయ్, కె.ప్రవీణ్, మాదాసు ఆదాం, మధుసూదన్‌రావు, మస్తాన్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నగర పరిశుభ్రత అందరి బాధ్యత

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం అర్బన్: అభివృద్ధి బాటలో ముందుకు సాగుతున్న ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 2వ డివిజన్ పాండురంగాపురంలో పర్యటించి రూ.కోటి వ్యయంతో చేపట్టనున్న స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వర్షాకాలం నేపథ్యాన మురుగు కాల్వల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, తాగునీటి సరఫరా కోసం రూ.220 కోట్లు అదనంగా మంజూరయ్యాయని తెలిపారు. మత, కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లాభాలు పొందాలనుకునే వారిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతురావు, ఆర్డీఓ నరసింహారావు, తహసీల్దార్ సైదులు, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి, లకావత్ సైదులు, దుద్దుకురి వెంకటేశ్వర్లు, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, పల్లెబోయిన చంద్రం తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను వినియోగించుకోండి



విత్తనాల పంపిణీని ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

రఘునాథపాలెం: ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని మంచుకొండ సహకార సంఘంలో సబ్సిడీపై విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని సొసైటీ చైర్మన్ తాతా రఘురాంతో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు తమ పాస్‌బుక్ జిరాక్స్ తీసుకొచ్చి పచ్చిరొట్ట, జీలుగు విత్తనాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, మాజీ చైర్మన్ తుమ్మలపల్లి మోహన్‌రావు, మాజీ ఉపసర్పంచ్ వెంకటనారాయణ, సంఘ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీలను..

కూసుమంచి: ఉద్యానవనశాఖ ఆధ్వర్యాన రైతులకు అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని పాలేరు డివిజన్ ఉద్యానశాఖ అధికారి పి.అపర్ణ అన్నారు. మామిడి, జామ, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, ఉసిరి లాంటి పండ్ల తోటలు సాగు చేసే రైతులకు 40 రాయితీ, కూరగాయల సాగు, మల్చింగ్ విధానంలో మిరప సాగు చేసే రైతులకు 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యాన, వ్యవసాయ పంటలకు సూక్ష్మసేద్యానికి 80 నుంచి 100 శాతం రాయితీ, తుంప సేద్యానికి 75 శాతం రాయితీతో పరికరాలు, ఆయిల్‌పామ్ మొక్కలకు, బిందు సేద్యానికి రాయితీలు వర్తిస్తాయన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం



మాట్లాడుతున్న ఏఓ రాధ

నేలకొండపల్లి: విత్తనాల ఎంపికలో రైతులు అప్రమతంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఎం.రాధ సూచించారు. మండల కేంద్రంలోని ఏఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు నాణ్యమైన విత్తనాలను లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే కొనాలని, బిల్లులు తప్పనిసరిగా తీసుకొని పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచాలన్నారు. గ్రామాల్లో విత్తనాలు విక్రయించే వారు కనబడిన, బిల్లులు ఇవ్వని వ్యాపారులు ఉన్నట్లయితే వెంటనే వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారని అన్నారు.

నాయీబ్రాహ్మణులకు గుర్తింపు కార్డులు..



గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న సంఘం బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని బుర్హాన్‌పురం నాయీబ్రాహ్మణ కాలనీలో గల సంఘ కార్యాలయంలో సంఘ సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సంఘం నగర అధ్యక్షుడు యలమందల జగదీష్ మాట్లాడుతూ.. హెయిర్ సెలూన్లలో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణుల వ్యక్తిత్వాన్ని నిలబెట్టేందుకే గుర్తింపు కార్డులు అందించినట్లు తెలిపారు. తమ ఉపాధి కోల్పోయేలా చేసి, నాయీబ్రాహ్మణుల జీవితాల్లో చీకట్లు నింపుతున్న కార్పొరేట్ హెయిర్ సెలూన్లకు అడ్డుకట్ట వేసేంత వరకు పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కేఎంసీలో కోల్డ్ వార్..?

- ఇద్దరు అధికారుల మధ్య ఆధిపత్యపోరు
- గతంలో పని చేసిన చోట ఆరా తీస్తున్న వైనం
- అనుచరులను కాపాడుకునేందుకే అంటూ చర్చ
- కేఎంసీ ప్రతిష్టను దిగజార్చుతున్నారని విమర్శలు



ఖమ్మంమయూరిసెంటర్: నిత్యం సమస్యలతో కార్యాలయానికి వచ్చే ప్రజలు.. ఆ సమస్యలను పరిష్కరించేందుకు తీరిక లేకుండా పని చేస్తున్న ఉద్యోగులు, అధికారులు.. వారిని సమన్వయం చేస్తూ పలు కీలక ఆదేశాలు జారీ చేసే కమిషనర్ ఇలా ఎవరి పనిలో వారు ఉండగా.. ఓ ఇద్దరు అధికారులు మాత్రం తమ ఆధిపత్యాన్ని చాటుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్న విమర్శలు కేఎంసీలో బహిరంగంగా వినిపిస్తున్నాయి. వారి ఆధిపత్య పోరు ఏకంగా ఇతర మున్సిపాలిటీల్లో చర్చకు కూడా దారితీసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకరు అదే శాఖకు చెందిన అధికారి కాగా.. మరొకరు ఇతర శాఖ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారి. వీరి వ్యవహార శైలి అటు ఉన్నతాధికారులతో పాటు ఇటు ప్రజాప్రతినిధులకు తలనొప్పిగా మారిందనే చర్చ ఉంది.

ఒకరిపై మరొకరు..

ఈ ఇద్దరు అధికారులు ఒకరిపై మరొకరు ఆధిపత్యం చలాయించేందుకు వర్గాలను తయారు చేసుకున్నట్లు కార్యాలయంలో చర్చించుకుంటున్నారు. మున్సిపల్ శాఖకు చెందిన అధికారి ప్రతి చర్యను నిరంతరం తెలుసుకునేందుకు డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారి కొంత మంది ఉద్యోగులను తన వర్గంగా తయారు చేసుకొని వారి ద్వారా సమాచారం సేకరిస్తున్నారనే చర్చ ఉంది. శాఖకు చెందిన అధికారి వద్ద ఉన్న కొంత మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఇతర వ్యక్తులు పక్కనే ఉంటూ డిప్యూటేషన్ అధికారి, ఆయన అనుచరుల కదలికలు, వారి చర్యలను కనుక్కొని తెలియజేస్తున్నారని తెలిసింది.

పక్క మున్సిపాలిటీల్లో ఆరా..

అధికారుల ప్రవర్తన, వారి వ్యవహారశైలితో కేఎంసీ ప్రతిష్ట దిగజారుతుందని కొందరు అధికారులు, ఉద్యోగులు చర్చించుకోవడం గమనార్హం. పక్క మున్సిపాలిటీలో పని చేసి వచ్చిన అధికారి గురించి, ఇతర వ్యక్తుల గురించి కేఎంసీ నుంచి మరో అధికారి ఫోన్ చేసి కనుక్కోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవల తొలగించిన సిబ్బందిని కాపాడుకునే పనిలో భాగంగానే సదరు అధికారి పక్క మున్సిపాలిటీలోని సిబ్బందికి ఫోన్ చేసి అక్కడ పని చేసిన అధికారి, తొలగించిన ఇతర సిబ్బంది గురించి ఆరా తీసినట్లు తెలిసింది. ఇప్పటి వరకు కేఎంసీలోనే కాకుండా జిల్లాలోని పక్క మున్సిపాలిటీల్లో కూడా ఇదే చర్చ జరుగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వీరి ఆధిపత్య పోరుకు అడ్డుకట్టవేయకుంటే మున్ముందు కేఎంసీని మరింత అప్రతిష్టపాలు చేస్తారనే విమర్శలు ఉన్నాయి.

❑ డ్రెయినేజీల్లో మురుగు నిల్వ ఉండొద్దు



మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని డ్రెయినేజీల్లో మురుగు నిల్వ ఉండకుండా పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కేఎంసీలో ఇంజనీరింగ్ అధికారులతో వర్షాకాలంలో వరదలు, నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. గతేడాది అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అన్ని చర్యలను చేపట్టాలఅన్నారు. మున్నేరుకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటి వలన వరదలు వస్తుంటే.. నగర మధ్యలో డ్రెయినేజీల్లో వ్యర్థాలు, మురుగు పేరుకుపోయి వరదలు వస్తున్నాయని అన్నారు. ప్రధాన డ్రెయినేజీలు పొంగి పొర్లే ప్రదేశాలను గుర్తించి వెంటనే శుభ్రం చేయించాలని, వర్షపు నీరు ఇళ్లల్లోకి వచ్చే ప్రాంతాల్లో వార్డు ఆఫీసర్లు, శానిటర్ సూపర్‌వైజర్‌తో కలిసి బృందాలుగా ఏర్పడి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే తాత్కాలిక పునరావాస కేంద్రాలను ముందస్తుగానే సిద్ధం చేసుకునేందుకు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ రంజిత్, ఈఈ కృష్ణాలాల్, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ డీఈఈలు ధరణికుమార్, నవీన్‌కుమార్, ఏఈఈలు పాల్గొన్నారు.

❑ అక్రమ నిర్మాణం తొలగింపు..

నగరంలోని బుర్హాన్‌పురం రోడ్డు నంబర్ 7లో అనుమతులు లేకుండా ఓ భవనంపై చేపట్టిన అదనపు నిర్మాణాన్ని కేఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకున్నారు. అదనపు నిర్మాణాన్ని తొలగించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అదనపు నిర్మాణాలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. నగరాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.